క్లుప్తంగా

40 నంబరు ఆర్టీసీ బస్సు రూటు పునః ప్రారంభం

చిక్కడపల్లి: దాదాపు ఏడాది పాటు 40 నంబరు బస్సు అశోక్‌నగర్ మీదుగా వెళ్లడం మొత్తంగా ఆగిపోయిన నేపథ్యంలో మంగళవారం తిరిగి యథాతథంగా తిరగనుంది. ఈ మేరకు స్థానికుల విజ్ఞప్తి మేరకు రెండుసార్లు అధికారులతో సమావేశం నిర్వహించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తిరిగి ఈ రూట్‌లో 40 నంబరు బస్సు తిరిగి నడిచేలా విశేష కృషి చేశారని ప్రజలు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు అశోక్‌నగర్ చౌరస్తాలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలిస్తారని గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాకేష్ ప్రకటించారు.

కార్పొరేటర్ పర్యటన



అధికారులతో కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, బస్తీవాసులు

చిక్కడపల్లి: అరుంధతినగర్ బస్తీలో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు ఆమె వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్తీవాసులు కలుషితనీరు, లోప్రెషర్ సమస్యలు, డ్రైనేజీ ఓవర్ ఫ్లోతో మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలపై స్థానికులు అధికారులకు విన్నవించగా.. ఈ సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నగర యువ నాయకుడు వినయ్‌కుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

త్యాగరాయగాన సభలో గీతాలాపన

చిక్కడపల్లి: మీనాక్షి గ్రూప్ వందవ కార్యక్రమం ఆబాల గోపాలం ఆకట్టుకుంది. సోమవారం సాయంత్రం త్యాగరాయగాన సభలో యువ గాయకుడు సాయికృష్ణ మధురగాయకుడు ఘంటసాల గీతాలు, చంద్రశేఖర్ ఈ సందర్భంగా వేమన, అమృతవల్లి, భువన, శిరీష, జ్యోతిర్మయి తదితరులు సినీగీతాలు గానం చేశారు. సంస్థ స్థాపకులు సూర్య మీనాక్షి అధ్యక్షుడు వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి ఓయూ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో రేపు జరిగే పరీక్షలను వాయిదా వేసినట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు పేర్కొన్నారు. మార్చి 1న యూజీసీ నెట్ పరీక్ష కారణంగా ఎంఏ ఇంగ్లిష్ 3వ పేపర్ పరీక్షను 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

డిగ్రీ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో డిసెంబర్‌లో జరిగిన వివిధ డిగ్రీ రెగ్యులర్ కోర్సుల పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల 3, 5 సెమిస్టర్ పరీక్షలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు. పరీక్షలో తప్పిన విద్యార్థులు రీ వాల్యుయేషన్ కోసం మార్చి 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని, రూ.200 అపరాధ రుసుంతో 8 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. సోమవారం ఇండియన్ ప్రజా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే బిల్లును మార్చి 15వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఓర్వలేకనే ఆప్ నాయకుల అరెస్టులు

లిబర్టీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయంగా ఆప్‌ను ఎదుర్కోలేక తప్పుడు మార్గాల్లో వెళుతోందని, తమ మాట వినని వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆమ్‌ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. అడ్డు ఉన్న ప్రభుత్వాలను అస్థిరపరచడం బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం పరిపాటుగా కేంద్రానికి మారిపోయిందని ఆరోపించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్స్ స్కాం పేరుతో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్‌సిసోడియను అరెస్టు చేయడం సరికాదన్నారు.

ఇందిరాపార్కులో గంధపు చెట్లు మాయం !



ఇందిరాపార్కులో వరుసగా గంధపు చెట్లను నరికి దుండగులు యథేచ్ఛగా తరలించుకుని పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పార్కు సంరక్షణ కోసం జీహెచ్ఎంసీ ఉద్యాన శాఖ సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నా.. దుండగులు మిషన్‌లు పెట్టి మరీ గంధపు చెట్లను నరికి వేయడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. దొంగతనం జరిగిన సందర్భంలోనే అధికారులు హడావిడి చేస్తూ తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలున్నాయి.

వరుసగా ఇది నాల్గోసారని ప్రజల మండిపాటు

- చెట్లను నరికినప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారని విమర్శలు
- పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కవాడిగూడ: నగరంలో ఎవరైనా ఎక్కడైనా చెట్లు, చెట్టు కొమ్మలను కొట్టిన సెకండ్లల్లో వచ్చి చర్యలు తీసుకునే అధికారులు చరిత్రాత్మకమైన ఇందిరా పార్కు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరుసగా నాలుగు సార్లు...

- ఇందిరాపార్కులో సందర్శకుల ఆహ్లాదం కోసం పెంచుతున్న గంధపు చెట్లను వరుసగా నాలుగు సార్లు దుండగులు నరికి ఎత్తుకెళ్తున్నారు.
- గత రెండేళ్ల క్రితం 13 చెట్లను, తాజాగా శనివారం రాత్రి పార్కులోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 10 గంధపు చెట్లను మిషన్‌లతో నరికేసి గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్లారు.

ఇంటి దొంగల పనేనా ..

రాత్రి వేళల్లో సైతం పార్కుకు ప్రధానంగా ఉన్న రెండు గేట్లల్లో సెక్యూరిటీ కాపలా కాస్తూ.. ఎవరిని లోపలికి అనుమతించరు. ఇంత పగడ్బందీ సెక్యూరిటీ ఉన్నప్పటికీ గంధపు చెట్లను రాత్రి వేళల్లో పార్కులోకి ప్రవేశించి రంపం, మిషన్‌తో చెట్లను కోస్తున్నప్పుడు శబ్దం కూడా వినకుండా సిబ్బంది ఏమి చేస్తున్నారని సందర్శకులు ప్రశ్నిస్తున్నారు.



వరుస దొంగతనాలు..

ఇంటి దొంగల సహకారంతోనే జరుగుతుందా.. అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వరుస దొంగతనాలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని దొంగలకు సహకరిస్తున్న ఇంటి దొంగలను సైతం కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే

ఇందిరాపార్కులో వరుసగా గంధపు చెట్ల దొంగతనాలు జరగడమంటే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం. గతంలో దొంగతనాలు జరిగినప్పుడే అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సింది. దొంగతనాలు జరిగినప్పుడే అధికారులకు పార్కు గుర్తుకు వస్తుంది. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. – జి.రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

ఉద్యానశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు

పార్కులో గంధపు చెట్ల దొంగతనం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేశాం. గతంలో పార్కులో నరికివేతకు గురైన గంధపు చెట్ల స్థానంలోనే తిరిగి గంధపు చెట్లను నరికి వేశారు. పాత నేరస్తుల ప్రమేయం ఉండొచ్చనే అనుమానం వ్యక్తం ఉంది. త్వరలోనే కేసును పరిష్కరిస్తాం. – ఎ.యాదగిరి, చిక్కడపల్లి ఏసీపీ



నరికివేసిన గంధపు చెట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ తదితరులు



చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

చిక్కడపల్లి: 'అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు బంద్' అనే శీర్షికన సాక్షిలో కథనం వెలువడగా.. దీనికి గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ స్పందించారు. వెంటనే అధికారులతో మాట్లాడి పాలను తెప్పించి సమస్యను పరిష్కరించారు.

- జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంల్లో పాలు రావడం లేదని స్థానిక తల్లిదండ్రులు, గర్భిణీ స్త్రీలు, అంగన్‌వాడి టీచర్ గుర్రం నర్సమ్మ తెలిపిన సమాచారం మేరకు సాక్షి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన స్థానిక కార్పొరేటర్ స్పందించి సీపీడీఓ అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించారు.



- ప్రస్తుతం 2 నెలలకు సరిపడే 216 లీటర్ల పాల డబ్బాలను అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చాయని కేంద్రం టీచర్ నర్సమ్మ తెలిపారు. పిల్లకు పోషక పదార్థాలు, గుడ్లు అందించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్ తదితరులున్నారు.

యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహనీయుడు మల్లయ్య



మల్లయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్

కవాడిగూడ: బీసీ సామాజిక హక్కుల కోసం తుది శ్వాస వరకు పోరాడిన యోధుడు గంగపుత్ర సంఘం ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.ఎల్.మల్లయ్య అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించిన మహనీయుడని కొనియాడారు. సోమవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మల్లయ్య నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో నగేష్‌ముదిరాజ్ పార్టీకి రాజీనామా చేసి బీఎల్ఎఫ్ తరఫున పోటీ చేయాలనుకున్నారు. అప్పటికే బీఎల్ఎఫ్ బీ-ఫామ్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని మల్లయ్యకు అందజేసినా.. తాను కోరడంతో బీ- ఫామ్ తిరిగిచ్చి యువత రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించారన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

అంబర్‌పేట: స్వచ్ఛ హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి స్వచ్ఛ హైదరాబాద్, స్వచ్ఛభారత్‌పై నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు మాత్రమే చెత్తను వేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య విభాగం సిబ్బంది ప్రదీప్‌రెడ్డి, రేణుకా, ఉమేష్, పాషా, శ్రీనివాస్, భాస్కర్, సరస్వతి గాంధీ హైస్కూల్, ప్రగతి విద్యానికేతన్, సరస్వతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పాత పనులు పూర్తయితేనే కొత్త అభివృద్ధి పనులు



జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌లో ప్రారంభించిన పనులు పూర్తయితేనే కొత్త వాటిని ప్రారంభించాలని కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. పాత పనులు ప్రారంభాలకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను నిర్మాణాత్మకంగా చేపట్టాలని పనులు అసంపూర్తిగా వదిలేసే విషయాన్ని ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలలు గడుస్తున్నా చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు డీఈ ప్రసాద్, ఏఈ కిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌లు పాల్గొన్నారు.

మార్షల్‌ఆర్ట్స్ శరీర దారుఢ్యాన్ని పెంచుతాయి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కరాటే, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్‌లు శరీర దారుఢ్యంతో పాటు మానసిక వికాసాన్ని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని రామ్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీ నైబర్ హుడ్ కమ్యూనిటీహాల్‌లో తైక్వాండో అసోసియేషన్, హైదరాబాద్ తెలంగాణ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ కలర్ బెల్ట్ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సుమారు 150 మంది విద్యార్థులకు కలర్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తైక్వాండోలో శిక్షణ తీసుకోవడం వల్ల క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, తెలంగాణ జనరల్ సెక్రటరీ వాహజ్ అలీ, మాస్టర్ ఎగ్జామినర్ నర్సింహ్మ, మాస్టర్ కృష్ణ, రమేష్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నాంజనేయులు, కిరణ్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారణమైన వారిని శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న దృశ్యం

ముషీరాబాద్: డాక్టర్ ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ.. పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మార్క్స్‌భవన్ నుంచి రాంనగర్ చౌరస్తా వరకు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. కళాశాలలో ర్యాగింగ్ భూతం వెర్రి తలలు వేస్తూ.. విద్యార్థుల చావులకి కారణమవుతోందన్నారు. వీటిని అరికట్టే పరిస్థితిలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

- మెడికల్ చదువుకు విద్యార్థి తల్లిదండ్రులు ఆస్తులను తాకట్టు పెట్టి చదివిస్తే వారు శవమై తిరిగి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాపంథా నగర కార్యదర్శి హన్మేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఎస్.ప్రదీప్, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహ కార్యదర్శులు ఎస్.అనిల్, ప్రవీణ్, నాయకులు వరలక్ష్మి, దేవమణి, శ్యామల, లత, రవికుమార్, శ్రీను, రాకేష్, తిరుపతి, ఆంజనేయులు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకోవాలి'



పులిగారి గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ: తెలంగాణ ప్రజలకు అన్నం తినడం నేర్పింది తానేనని టీడీపీ అధినేత చంద్రబాబు అనాలోచిత, అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని దీన్ని తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తోందని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. 'టీడీపీ రాకముందు రాష్ట్రంలో జొన్నలు, రాగులు, సజ్జలు లాంటివి తినేవారని, మొదటిసారిగా తెలంగాణ బియ్యంతో అన్నం వండుకొని తినడం, రెండు రూపాయల కిలో బియ్యంతో మొదలైందని గుర్తు పెట్టుకోవాలన్నారు'. ఈ మేరకు సోమవారం కవాడిగూడలోని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు వ్యాఖ్యల వల్ల ఎన్టీఆర్ ఆత్మ ఘోషిస్తుందన్నారు.

- వరంగల్ బియ్యం, మెదక్‌జిల్లా పేరే మెతుకు అని చరిత్ర చదివితే తెలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల వల్ల దేశంలోని కార్మికులు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు వలసలు వచ్చి జీవిస్తున్నారన్నారు.
- రాష్ట్రంలోని 40 వేల చెరువులు కుంటలను బాగు చేయడం వల్ల సాగు, తాగునీటి వల్ల దేశానికి అన్నం పెట్టే దశకు చేరిందన్నారు. హైదరాబాద్ బిర్యానీని జొన్నలు, రాగులతో కూడా చేసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.
- అమరావతి రాజధాని నగరమంటూ 30 వేల వ్యవసాయ భూమితో భూ లావాదేవీలు చేసిందెవరని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ సెక్రటేరియట్‌ను కట్టించిన ఘనత చంద్రబాబుకు నిద్ర లేకుండా చేస్తుందన్నారు. ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు.

త్యాగరాజ స్వామి కీర్తనలతో మార్మోగిన నల్లకుంట



త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తున్న హేమశ్రీ సుమద్యుతి

నల్లకుంట: త్యాగరాజ స్వామి కీర్తనలు అజరామరమని శ్రీరామ గానసభ కార్యదర్శి కొణికి శాయి శ్రీనివాసశర్మ అన్నారు. నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణం త్యాగరాజ స్వామి కీర్తనలతో మార్మోగింది. శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగారాజ స్వామి 54వ వార్షిక ఆరాధన సంగీత మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. సోమవారం ప్రముఖ సంగీత విద్వాంసులు హేమశ్రీ సుమద్యుతి ఆలపించిన త్యాగరాజస్వామి కీర్తనలు, కోలంక బ్రదర్స్ వయోలిన్ ద్వయం ఆహతులను అలరించాయి. దీనికి అనిల్‌కుమార్, సాయికుమార్, రమణమూర్తి వయోలిన్‌పై సిరిపల్లె నాగేశ్వరరావు, రవికుమార్ మృదంగం, చంద్రకాంత్ ఘటంపై వాయిద్య సహకారం అందించారు. మార్చి 5 వరకు మహోత్సవాలు కొనసాగుతాయని శ్రీరామగాన సభ కార్యదర్శి శ్రీనివాసశర్మ తెలిపారు.

ఫీజుల పెంపుపై విద్యార్థుల రాస్తారోకో

ఉస్మానియా యూనివర్సిటీ: మొదటి సంవత్సరం పీజీ కోర్సుల పరీక్ష ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ సోమవారం ఓయూ విద్యార్థులు క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యార్థులు ఆందోళన చేపట్టిన అధికారులు స్పందించకపోవడంతో సాయంత్రం 6 గంటల వరకు రోడ్డుపైనే బైఠాయించగా 15 మంది విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రవేశ ద్వారాలను మూసివేయడంతో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఓయూ ట్రాఫిక్‌ను దారి మళ్లించడంతో తార్నాక నుంచి నల్లకుంట వరకు, విద్యానగర్ నుంచి శివం వరకు ట్రాఫిక్‌జామ్‌తో 3 గంటల పాటు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

కంచర్ల గోపన్న తెలుగు వారందరికీ ఆరాధ్యులు

చిక్కడపల్లి: భక్త రామదాసుగా ప్రసిద్ధి పొంది వందల కీర్తనలు రచించిన కంచర్ల గోపన్న తెలుగు వారందరికీ ఆరాధ్యులని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో కంచర్ల గోపన్న జయంతి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచల రామాలయం స్థాపనకోసం తొలి బీజం వేసిన రామదాసు ప్రభుత్వ పన్నులు తహసీల్దార్‌గా వసూలు చేసి ఆలయ నిర్మాణానికి వెచ్చించి కష్టాల పాలయ్యారని చివరికి రామలక్ష్మణులు వచ్చి నవాబుకు డబ్బు చెల్లించారని చెబుతూ.. అంతటి రామభక్తుడు గోపన్న అని కొనియాడారు. గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ.. దక్షిణ భారత వాగ్గేయకార ప్రముఖుల్లో ఒకరని కీర్తనలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ఘంటసాల గానసభ అధ్యక్షుడు కేవీ రావు, కళాపోషకుడు వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.



బండ శ్రీనివాస్, కృష్ణ జనార్దనమూర్తి, కేవీరావు, వెంకట్‌రెడ్డి తదితరులు

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

చిలకలగూడ: అంధత్వ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఇప్పటి వరకు ఎంతమందికి కళ్లద్దాలు అందించారు.. రోజుకు ఎంతమందికి వైద్యసేవలు అందిస్తున్నారు వంటి వివరాలతో పాటు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్ల పనితీరుపై ఆరా తీశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో యజ్ఞంలా కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్ ..

క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విద్యను అభ్యసిస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని బ్రాహ్మణబస్తీ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆమె సందర్శించి పలు అంశాలపై ఆరా తీసి విద్యార్థులతో ముచ్చటించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేసవి కాలంలో ఎక్కువగా నీళ్లు తాగాలని, వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని తల్లితండ్రులతో పాటు చదువుచెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ లావణ్య



అడిక్‌మెట్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అంబర్‌పేట: వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ సర్కిల్ 16 డీఎంసీ వేణుగోపాల్ సూచించారు. సోమవారం గోల్నాక కమలానగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి అవగాహన కల్పించారు. వీధి కుక్కలు గుంపుగా ఉన్నప్పుడు కాస్త దూరంగా వెళ్లాలని, కుక్క పిల్లలు తల్లి దగ్గర ఉన్నప్పుడు వాటిని ముట్టుకోవద్దని సూచించారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు. జీహెచ్ఎంసీ వెటర్నరీ వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధికుక్కల సమస్య పరిష్కారానికి చొరవ..

- వీధికుక్కల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో వీధికుక్కల సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆమె స్పందించారు. సోమవారం జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో వీధికుక్కలను ఆమె జీహెచ్ఎంసీ సిబ్బందికి పట్టించారు. ప్రధానంగా డివిజన్‌లో బతుకమ్మకుంట శ్రీనివాసనగర్, రహత్‌నగర్, పోచమ్మ బస్తీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఆ ప్రాంతాల్లో దృష్టి సారించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

కుక్కల బెడదపై జీహెచ్ఎంసీ అవగాహన కార్యక్రమాలు..

ముషీరాబాద్: కుక్కల బెడదపై జీహెచ్ఎంసీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఏఎంహెచ్ఓ డాక్టర్ మైత్రియులు సోమవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని మేడిబాయిబస్తీ అంగన్‌వాడీలోని పిల్లలకు కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు వారి తల్లిదండ్రులకు వీధి కుక్కల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని వీధి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టామన్నారు. పాఠశాలల పరిసరాల్లో కుక్కల సంచారం లేకుండా పాఠశాల యాజమాన్యాలు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. చికెన్, మటన్‌షాపులు నిర్వహించే వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపై వేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను జాగృతపరుస్తున్నట్లు వెల్లడించారు.